క్లుప్తంగా

విద్యార్థికి సన్మానం

జన్నారం: జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన సిరినేని రాహుల్ ఎంబీబీఎస్ సీటు సాధించగా శుక్రవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సంఘం మండల అధ్యక్షుడు చెటుపల్లి గంగయ్య మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన రాహుల్ చదువులో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమన్నారు. నాయకులు సత్యం, వీరయ్య, దశరథం, భాస్కర్, కృష్ణ, శ్రీనివాస్, మహేశ్, రామన్న, కొమురయ్య, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

'పట్టుదలతో లక్ష్యాలు సాధించాలి'

జన్నారం: మానసిక ఒత్తిడిని వదిలేసి పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాలు చేరుకోవచ్చని ప్రముఖ సైకియాట్రిస్టు డాక్టర్ సునీల్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలుగా మారవద్దన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కరుణాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన వ్యవసాయాధికారులు

నెన్నెల: మండల వ్యవసాయాధికారిణిగా పుష్పాల సృజన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఏవోగా ఉన్న కిరణ్మయి మందమర్రి మండలం వ్యవసాయాధికారిణిగా బాధ్యతలు చేపట్టారు.
భీమిని: కన్నెపల్లి, భీమిని మండల వ్యవసాయాధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కన్నెపల్లి ఏవోగా సాయి ప్రశాంత్, భీమిని ఏవోగా యమునా దుర్గాలు నియమితులయ్యారు.

'క్వార్టర్లను పర్మినెంట్‌గా కేటాయించాలి'

మందమర్రిరూరల్: సింగరేణిలో ఉద్యోగులు సొంతింటి కల నెరవేరాలంటే ఉద్యోగులు నివసిస్తున్న క్వార్టర్లను పర్మినెంట్‌గా వారికే కేటాయించాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జక్కనబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియాలోని కేకే 5 గనిపై నిర్వహించిన సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడారు. నాయకులు రాజిరెడ్డి, సుదర్శన్, శ్రీనివాస్ రెడ్డి, రామస్వామి ఉన్నారు.

హద్దు రాళ్ల తొలగింపు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్ ఏరియాలో అక్రమంగా ఏర్పాటు చేసిన హద్దురాళ్లను శుక్రవారం రెవెన్యూ అధికారులు జేసీబీ సహాయంతో తొలగించారు. సర్వే నంబర్ 7లో లావణి పట్టా భూములలో ప్లాట్లు ఏర్పాటు చేయడం సరికాదని, ఈ భూములు కేవలం సాగు చేసేందుకు ఇచ్చినవని తహసీల్దార్ సతీశ్ పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'మత్తడి పేల్చివేతతో సంబంధం లేదు'

చెన్నూర్: చెన్నూర్ శనిగకుంట మత్తడి పేల్చివేత ఘటనతో తనకెలాంటి సంబంధం లేదని మాజీ సర్పంచ్ గొడిసెల బాపురెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. శనిగకుంట చెరువు ముందు భూమి కొన్న విషయం వాస్తవమేనని, కొంత ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో ఉండడంతో తన డబ్బులు తనకు ఇవ్వాలని సదరు యజమానులను కోరానని అన్నారు. పోలీసుల విచారణకు సహకరించానని తెలిపారు. ఇకనైనా అసత్య ఆరోపణలు మానుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యుడు అజ్గర్ అలీ, కాంగ్రెస్ నాయకులు పోగుల సతీశ్, సుశీల్‌కుమార్, చెన్నూరి రాజేశ్, తనుగుల రవికుమార్, అఖిల్, చెన్న వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటల క్షేత్ర పరిశీలన

భీమారం: మండలంలోని దాంపూర్ గ్రామ శివారులో రైతులు సాగుచేస్తున్న పత్తి పంటను శుక్రవారం చెన్నూర్ ఏడీఏ బానోత్ ప్రసాద్ నాయక్ పరిశీలించారు. ఈమేరకు రైతులు పండిస్తున్న పత్తి పంటలను పరిశీలించారు. పత్తిలో రసం పీల్చే పురుగులతో పాటు పొగాకు లద్దె పురుగులు గుర్తించారు. పురుగుల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పేకాటస్థావరంపై దాడి

దండేపల్లి: దండేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండాల అటవీ రోడ్ సమీపంలో చెట్లపొదల్లో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శుక్రవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి నలుగురిని పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.53,460 నగదు, నాలుగు సెల్ ఫోన్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో ఇద్దరు పారిపోయారని పేర్కొన్నారు. కేసువిచారణ నిమిత్తం దండేపల్లి ఎస్సైకి అప్పగించినట్లు వివరించారు.

'కార్తీక వనం' కనుమరుగు

- గత ఏడాది పార్క్‌ను మూసేసిన అటవీశాఖ
- 40ఏళ్ల పర్యాటక కేంద్రానికి స్వస్తి
- పిల్లల క్రీడాసామగ్రి తరలింపు
- తిరిగి ఏర్పాటు చేయాలని డిమాండ్


వెలవెలబోతున్న పార్క్


మూలనపడ్డ పర్యాటకులు సేదతీరేందుకు ఏర్పాటు చేసిన కుర్చీలు

భీమారం: గత 40 ఏళ్ల నుంచి పర్యాటకులతో కళకళలాడిన కార్తీకవనం(పార్క్)ను అటవీశాఖ ఎత్తివేయడంతో ప్రస్తుతం ఆ ప్రాంతం నిర్మానుష్యంగా మారింది. మంచిర్యాల అటవీడివిజన్ పరిధిలోని భీమారం రిజర్వు ఫారెస్ట్‌లో గతంలో ఏర్పాటు చేసిన కార్తీకవనాన్ని గత సంవత్సరం మూసివేశారు. అందులోని ఆట వస్తువులను అప్పటి మంచిర్యాల ఎఫ్‌డీవో వినయ్‌సాహు నేతృత్వంలో తొలగించి మంచిర్యాల సమీపంలోని గాంధారీ వనానికి తరలించారు. మంచిర్యాల –చెన్నూరు జాతీయ రహదారి పక్కనే జోడువాగులుగా పిలిచే చింతవాగు, గొల్లవాగులు ఉండటంతో అటవీశాఖ అధికారులు పార్క్‌ను ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా గుర్తించారు. ఇందులో అనేక సదుపాయాలు కూడా ఏర్పాటు చేశారు. దాదాపు 10 ఎకరాల్లో స్థలాన్ని చదునుచేసి పిల్లలు ఆడుకునేందుకు జారుడుబండ, ఉయ్యాలలు, వెయిట్‌లిఫ్టలతో పాటు అనేక ఏర్పాట్లు చేశారు. ఒకవైపు దట్టమైన అడవిని చీల్చుకుంటూ వెళ్లే రహదారితో పాటు పక్కనే వాగులు ఉండటంతో పర్యాటకులు వచ్చేందుకు ఆసక్తి చూపేవారు.

ఇతర జిల్లాల నుంచి..
కార్తీకవనంలో సేదదీరేందుకు భీమారం, చెన్నూరు ప్రాంతాల నుంచే కాకుండా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి అనేక మంది వస్తుండేవారు. సింగరేణి సంస్థ పాఠశాలల విద్యార్థులను ఇక్కడికి తీసుకొచ్చేవారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అనేక కుటుంబాలు వచ్చి ఇక్కడ రోజంతా ఆహ్లాదంగా గడిపేవి.

పర్యాటక కేంద్రంపై నిర్లక్ష్యం
ఒకవైపు పర్యాటక కేంద్రాల అభివృద్ధికి పెద్దపీట వేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. కొత్తగా పర్యాటక కేంద్రం ఏర్పాటు చేయకున్నా ఉన్న పర్యాటక కేంద్రాన్ని ఎత్తివేయడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇందులోని ఆట వస్తువులను వేరేచోటకు తరలించాల్సిన అవసరం ఏంటని మండిపడుతున్నారు. గత కొన్నేళ్లుగా అటవీశాఖ పార్క్‌లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకున్నా రోజంతా గడిపే వారమని పలువురు పేర్కొంటున్నారు. అయితే అటవీశాఖ అధికారులు మాత్రం పార్క్ అభివృద్ధికి నిధులు లేకపోవడంతో ఎత్తివేసినట్లు చెబుతున్నారు.

తిరిగి ఏర్పాటు చేయాలి



భీమారంలో ఎత్తివేసిన కార్తీక వనంను అటవీశాఖ అధికారులు తిరిగి ప్రారంభించాలి. స్థానికంగా గొల్లవాగు ప్రాజెక్ట్ ఉండటంతో పర్యాటకులు అధిక మొత్తంలో ఇక్కడికి వచ్చేవారు. ప్రజలకు ఉపయోగపడే కార్తీకవనాన్ని వెంటనే ప్రారంభించాలి.
– గుడిమల్ల నరహరి, భీమారం

ఏర్పాటుకు కృషి



భీమారం జోడువాగుల వద్ద తిరిగి కార్తీక వనం ఏర్పాటు కోసం కృషి చేస్తాను. పర్యాటక కేంద్రం వల్ల ప్రజలకు ఎంతో ఉల్లాసం కలుగుతుంది. ఈమేరకు అటవీశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి పర్యాటక కేంద్రాన్ని తిరిగి ప్రారంభిస్తాం.
– వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి


నినాదాలు చేస్తున్న విద్యార్థి నాయకులు

బెల్లంపల్లి: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బెల్లంపల్లి ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఐక్య విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేశారు. తిలక్‌స్టేడియం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ బజారుఏరియా పుర వీధుల మీదుగా కాంటా చౌరస్తా వరకు సాగింది. ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుండా విద్యార్థులను వంచించగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానం కొనసాగిస్తోందని విమర్శించారు. విద్యార్థులకు దాదాపు రూ.7వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దీపక్ కుమార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీకాంత్, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు అల్లిసాగర్, ఏఐఎఫ్‌డీవై జిల్లా కార్యదర్శి పి.వెంకటేశ్, ఎన్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్: పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెన్నూర్, కోటపల్లి, భీమారం మండలాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు.
భీమారం: మండలంలోని 11 గ్రామ పంచాయితీల్లో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శంకర్ శుక్రవారం తెలిపారు.
మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా 19వ తేదీ శనివారం ఉదయం 9:30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హాజీపూర్ ఏఈ మహేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గుడిపేట, నంనూర్, చందనాపూర్, ముల్కల్ల గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు.
శ్రీరాంపూర్: నస్పూర్ మండల పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ శైసర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్‌లోని 33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9:30 గంటల నుంచి 11 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.
రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ప్రభాకర్ తెలిపారు. క్యాతనపల్లి సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కోసం మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్, అమరవాది, గద్దెరాగిడి, తిమ్మాపూర్‌లలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

సీఐ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన సీఐ ప్రమోద్‌రావు

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఐటీసెల్ విభాగంలో సీఐగా పని చేసిన ప్రమోద్‌రావు మంచిర్యాల పట్టణ సీఐగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన బన్సిలాల్‌ను హైదరాబాద్ ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రమోద్‌రావు గతంలో మంచిర్యాల రూరల్, మందమర్రి, చెన్నూర్ సీఐగా విధులు నిర్వహించారు. మంచిర్యాల ఇన్‌చార్జి సీఐగా సైతం పని చేశారు.

చర్చనీయాంశంగా సీఐ బదిలీ..
మంచిర్యాల సీఐగా పని చేసిన ఆర్. బన్సిలాల్ ఆకస్మిక బదిలీ పట్టణంలో చర్చనీయాంశమైంది. బన్సిలాల్ ఇక్కడ కేవలం 8 నెలలు మాత్రమే పని చేశారు. ఆయన విధులు నిర్వహించిన కాలంలో పలు దాడులు జరగడం, ఓ వర్గానికి కొమ్ముకాసినట్లు చర్చించుకోవడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శ్రీకాంత్ అవయవాల అమ్మకం ఘటన చోటుచేసుకుంది. కేసు విచారణ అధికారిగా ఉన్న బన్సిలాల్ అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి.

ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో రెండు రోజులుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ఫెన్సింగ్ జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఇందులో సెలక్ట్ అయిన జట్లను శుక్రవారం నిర్వాహకులు ప్రకటించారు. వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అవునూరి మహేశ్ తెలిపారు.

అండర్ 14 బాలికలు..
బి.నిక్షిత, టి. వైష్ణవి(శ్రీచైతన్య హైస్కూల్, లక్షెట్టిపేట్), సనా, కె.వైష్ణవి, టి.ఆరాధ్య (ఉజ్వల హైస్కూల్), క్షేత్ర (మిమ్స్ హైస్కూల్), యూ.లావణ్య (రెవల్యూషన్ హైస్కూల్), ఎస్కే సుహానా, హిమనీరెడ్డి (స్ప్రింగ్ ఫీల్డ్), యోగితాశ్రీ,, నిత్యాశ్రీ, ఎం. శ్రీవల్లి (శ్రీచైతన్య హైస్కూల్), స్టాండ్ బైలో విష్ణుప్రియ(శ్రీ చైతన్య హైస్కూల్), ఎండీ ఐషా ఫాతిమా (రెవల్యూషన్ హైస్కూల్), హెచ్. అక్షిత(ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్).

అండర్ 14 బాలురు..
రిత్విక్ రెడ్డి (ఉజ్వల హై స్కూల్), సిద్దార్థ, అయాన్ ఖాన్, సాయియశ్వంత్ (స్ప్రింగ్ ఫీల్డ్ హై స్కూల్), ఆర్షిత్, రిషిచరణ్ (రెవెల్యూషన్ హై స్కూల్), సీహెచ్ శ్రీహాస్ పటేల్, పూర్ణసాయి(మిమ్స్ హై స్కూల్), డి. శ్రీచరణ్ (శ్రీ చైతన్య హైస్కూల్ లక్షెట్టిపేట్), సాత్విక్, ఆదిత్య, మనిదీక్షిత్ (శ్రీ చైతన్య హైస్కూల్).

అండర్ 17 బాలికలు..
వెన్నెల, సీహెచ్ శ్రావ్య, జే.అర్చన(ఉజ్వల హై స్కూల్), ఏసమోజ్ వాలా, సాయిశ్రుతిక (మిమ్స్ హైస్కూల్), ఆర్. ఐశ్వర్య, జ్యోతి (స్ప్రింగ్ ఫీల్డ్ హైస్కూల్), హెచ్.దీక్షిత (శ్రీ చైతన్య హైస్కూల్), కాంపెల్లి వైష్ణవి (అల్ఫోన్స్ హైస్కూల్).

అండర్ 17 బాలురు..
కె.రాజ్, డి.హర్షవర్ధన్, ఈ. జశ్వంత్ (ఉజ్వల హైస్కూల్), మనీష్, అనికేత్ (మిమ్స్ హైస్కూల్), రోషన్, వెంకటసాయి (స్ప్రింగ్ ఫీల్డ్ హైస్కూల్), అశ్విత్, యస్. సిద్దార్థ్, బి. సాత్విక్, జీ.సాత్విక్ (శ్రీ చైతన్య హైస్కూల్), కె. సంజయ్ (గౌట్ హై స్కూల్,లక్షెట్టిపేట్), స్టాండ్ బైలో రాజేందర్, టీ.హన్షిత్ (గౌట్ హైస్కూల్, లక్షెట్టిపేట్), మనిదీక్షిత్(శ్రీ చైతన్య హై స్కూల్)లు సెలక్ట్ అయ్యారు.

ర్యాలీ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల


నిధుల వివరాల పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామ శివారులోని ర్యాలీ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ. 2 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు బ్రిడ్జి నిర్మాణానికి మంజూరైన నిధుల వివరాల లేఖను ముల్కల్ల ప్రజాప్రతినిధులకు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు సతీశ్‌రావు, సతీశ్‌యాదవ్, కుమార్‌యాదవ్, స్థానికులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి


మాట్లాడుతున్న పురుషోత్తం నాయక్

భీమిని: మహిళలు అక్షరాస్యతతో పాటు ఆర్థికంగా రాణించాలని జిల్లా వయోజన విద్యాశాఖాధికారి పురుషోత్తం నాయక్ అన్నారు. శుక్రవారం కన్నెపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో జిల్లా వయోజన విద్యాశాఖ, లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల సఖీ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ పొందిన మహిళలకు మూల్యాంకన పరీక్ష నిర్వహించారు. ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. సఖీ అధ్యక్షురాలు బండ శాంకరి మట్లాడుతూ మహిళలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సెక్టోరియల్ ఆఫీసర్ సత్యనారయణ మూర్తి, ఎర్ర సువర్ణ, అశోక్ రావు, జనార్ధన్, వెంకటేశ్వర్లు, సంధ్య, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పాత బతుకమ్మ చీరలు మాకొద్దు'

నెన్నెల: మండల కేంద్రంలో బతుకమ్మ చీరలు పంపిణీ చేయగా పాతచీరలు అవసరం లేదని మహిళలు తీసుకోకుండా వెళ్లిపోయారు. శుక్రవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా చీరలు అందజేయాలని అధికారులు నిర్ణయించినా సమయాభావంతో కార్యక్రమంలో పాల్గొనకుండా ఎమ్మెల్యే వెళ్లిపోయారు. ఆతర్వాత అధికారులు చీరలు ఇచ్చేందుకు గోదాం వద్దకు వెళ్లారు. చీరలు చూసిన మహిళలు పాత చీరలు మాకేందుకని ఐకేపీ ఏపీఎం విజయలక్ష్మిని నిలదీశారు. గతంలో మిగిలిన చీరలకు కొత్త స్టిక్కర్లు వేశారని ఆరోపించారు. దీంతో అధికారులు, నాయకులు చీరల పంపిణీ కార్యక్రమాన్ని రద్దు చేశారు.

కార్మికుల పీఎఫ్ తప్పులను సవరించాలి

మంచిర్యాలటౌన్: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల పీఎఫ్‌లను సవరించి, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను అమలు చేసేలా చూడాలని తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం సమావేశంలో తీర్మానించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం మున్సిపల్ కార్మికుల జనరల్‌బాడీ సమావేశాన్ని నిర్వహించి పలు సమస్యలపై చర్చించారు. మున్సిపల్ కమిషనర్ కార్మికుల స్థానంలో అక్రమంగా నమోదు చేసిన ఇతరుల పేర్లను తొలగించాలని, పీఎఫ్ తప్పులను సవరించే వరకు పోరాడాలని తీర్మానించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు దేవిసత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి అవునూరి గోపాల్, ఉపాధ్యక్షులు అవునూరి లింగయ్య, నక్క రాజమల్లు, మెరుగు సతీశ్, అవునూరి రాయమల్లు, మెరుగు సత్యనారాయణ, చిప్పకుర్తి చిన్న, సది, అవునూరి నర్సయ్య, సతీశ్, మల్లేశ్, నర్సయ్య పాల్గొన్నారు.

దళారులకు అమ్మి నష్టపోవద్దు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్


వ్యవసాయ పనిముట్ల దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వినోద్, కలెక్టర్

బెల్లంపల్లిరూరల్: రైతులు ఖరీఫ్ సీజన్ వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దని ఎమ్మెల్యే గడ్డం వినోద్, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి మండలంలోని చాకేపల్లి గ్రామంలో చంద్రవెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, జిల్లా పౌరసరఫరా శాఖ మేనేజర్ శ్రీకళ, చంద్రవెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ స్వామి, డైరెక్టర్ శ్రీనివాస్, తహసీల్దార్ జోత్స్న, మాజీ ఎంపీటీసీ మహేందర్, మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు స్వామి, గోపాల్, గణేశ్, స్వామి పాల్గొన్నారు.
నెన్నెల: స్వయం సహాయక సంఘాల్లోని ప్రతీ మహిళ వ్యాపార రంగంలో రాణించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ పనిముట్ల విక్రయ దుకాణం, మెడికల్ షాపులను కలెక్టర్ కుమార్ దీపక్, డీఆర్‌డీవో కిషన్‌లతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చాలా మంది మహిళలు పెట్టుబడులు లేక గ్రామీణ ప్రాంతంలో వ్యాపారాలు చేయడం లేదని, వారంతా సెర్ప్ ద్వారా, ప్రభుత్వ పథకాలను, ప్రోత్సాహకాలను ఉపయోగించుకొని వ్యాపారం ప్రారంభించి పారిశ్రామిక, వ్యాపారవేత్తలుగా అడుగులు వేయాలని సూచించారు. అనంతరం చిత్తాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, రైతులు, దళారులను నమ్మి మోసపోకూడదన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
మండలంలోని నందులపల్లి, గన్‌పూర్, గంగారాం ప్రాథమిక పాఠశాలల్లో రూ.30 లక్షల నిధులతో చేపట్టనున్న ప్రహరీ గోడల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆవుడం గ్రామంలో రూ.4 లక్షల ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా చేపట్టే సైడ్‌డ్రైయిన్ పనులకు భూమిపూజ చేశారు. కాంగ్రెస్ నాయకులు గట్టు మల్లేశ్, హరీశ్‌గౌడ్, మల్లాగౌడ్, తోట శ్రీనివాస్, మొహిద్‌ఖాన్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏపీఎం విజయలక్ష్మీ, ఎంపీవో శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో నరేశ్‌లు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేను తప్పుదోవ పట్టిస్తున్నారు'

నెన్నెల: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను పార్టీలో కొత్తగా చేరిన కొందరు నాయకులు తప్పుదోవ పట్టిస్తున్నారని సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొంతమంది పార్టీలు మారిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. గత సంవత్సరం నుంచి నడిచిన షాపులను మళ్లీ రీఓపెనింగ్ చేయించి పార్టీ పరువు మర్యాదలకు భంగం కలిగించారన్నారు. ఎమ్మెల్యేకు తప్పుడు సమాచారం ఇస్తూ ఇందిరమ్మ కమిటీల ఏర్పాటులో పార్టీ మారిన వారు ఇష్టానుసారంగా వ్యవహరించారన్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని సీనియర్ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గట్టు బానేష్, గోవింద్ సింగ్, పల్లె చంద్రయ్య, దుర్గం గంగయ్య, మధుకర్‌రెడ్డి, చంద్రమౌళిగౌడ్, గట్టు శివలింగయ్య, రాజయ్యలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కోనోకార్పస్ చెట్లను తొలగించాలి
బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ బజారు ఏరియా ప్రాంతంలో ఉన్న ప్రజారోగ్యానికి హాని కలిగించే విషపూరితమైన కోనో కార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ శ్రేణులు డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి అటవీ రేంజ్ అధికారి పూర్ణచందర్‌కు వినతిపత్రం అందజేశారు. యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ జిల్లా కన్వీనర్ సుధాకర్ పటేల్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బి.సాగర్ వర్మ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు
కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై తెలంగాణ గ్రామీణ బ్యాంకు, ఐకేపీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు అధికారి సాయికృష్ణ, సీసీ శారదలు కళాకారులతో అవగాహన కల్పించారు.

తాళ్లపేట పీహెచ్‌సీ సందర్శన
దండేపల్లి: నేషనల్ పాలియేటివ్ కేర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, మండలంలోని తాళ్లపేట పీహెచ్‌సీని పాలియేటివ్‌కేర్ టీం శుక్రవారం సందర్శించింది. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చికిత్స అందించడంతో పాటు వారిలోని బాధలు తగ్గించడంపై పాలియేటివ్‌కేర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అనంతరం పొగాకు రహిత సమాజంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు క్రాంతికుమార్ పాల్గొన్నారు.

చిర్రకుంటలో ఉచిత వైద్యశిబిరం
మందమర్రిరూరల్: మండలంలోని చిర్రకుంటలో శుక్రవారం ఉచిత వైద్య కంటి శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కంటి వైద్య నిపుణులు పవన్ ఆప్టికల్ సెంటర్ నిర్వాహకులు సుభాష్, సుమారు 50 మంది బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అందుబాటులో ఉన్న మందులు పంపిణీ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంచందర్, మాజీ సర్పంచ్ కొమురయ్య, గ్రామ పెద్దలు ఉన్నారు.

ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు
కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో శుక్రవారం ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పశువైద్యాధికారి సరిత ఆధ్వర్యంలో పశువులకు వేశారు. 318 ఆవులు, 476 గేదెలకు టీకాలు వేసినట్లు తెలపారు. కార్యక్రమంలో జేఈవో సంతోష్, సిబ్బంది రవీందర్, శ్యాం, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత సభ్యత్వ లక్ష్యం పూర్తి చేయాలి
బెల్లంపల్లి: నిర్దేశిత సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేయాలని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు గోనే శ్యాంసుందర్‌రావు సూచించారు. శుక్రవారం బెల్లంపల్లిలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్న బీజేపీని ప్రతీ ఒక్కరు బలపర్చాలన్నారు. మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, జిల్లా కార్యదర్శి కె.గోవర్ధన్, నాయకులు కేశవరెడ్డి, అజ్మీరా శ్రీనివాస్, రామయ్య, ప్రకాశ్, శ్రావణ్, దీపారాణి, శ్రీనివాస్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వివాహితను అప్పగించిన పోలీసులు
భీమారం: మండల కేంద్రంలో అదృశ్యమైన వివాహితను పోలీసులు గుర్తించి శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్సై రాములు కథనం ప్రకారం.. రెండు రోజుల క్రితం ఇంట్లో చెప్పకుండా వివాహిత స్వప్న ఎటో వెళ్లడంతో ఆమె భర్త రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్న క్రమంలో మహారాష్ట్ర పోలీసులు స్వప్నకు సంబంధించిన సమాచారం అందించారు. మహారాష్ట్రలోని సిర్వంచ వెళ్లి ఆమెను తీసుకొచ్చి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై రాములు తెలిపారు.

నేడు భగీరథ నీటి సరఫరా నిలిపివేత
మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలోని గ్రామాలకు శనివారం మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ ఏఈ గిరిజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద గల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో నిర్వహణ పనుల కారణంగా నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

కుందారంలో బెల్టుషాపుల వేలం
జైపూర్: మండలంలోని కుందారం గ్రామంలో రెండు బెల్ట్‌షాపులను ఓ కమిటీ ఇటీవల వేలం వేసింది. గురువారం బెల్ట్‌షాపులో జరిగిన గొడవతో ఈ విషయం బయటపడింది. దసరా పండుగను లక్ష్యంగా చేసుకుని స్థానిక నాయకులు ఓ కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో జనాభా ఎక్కువగా ఉందని, గ్రామ ఉత్తరం వైపు ఒకటి, దక్షిణం వైపు మరో బెల్ట్ షాపు ఏర్పాటుకు నిర్ణయించారు. అభివృద్ధి పేరుతో రూ.7లక్షలకు వేలం వేసినట్లు స్థానికులు తెలిపారు. బార్లను తలపించేలా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నా ఎక్సైజ్, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తులు అరెస్ట్
మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధి ఊరుమందమర్రి సమీపంలో గల రైల్వే ట్రాక్ వద్ద అక్రమంగా బైక్‌పై గుడుంబా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మామిడిగూడెంకు చెందిన వినోద్, చెన్నూర్ మండలం లంబడిపెల్లికి చెందిన రాజశేఖర్‌ల వద్ద నుంచి 200 ప్యాకెట్లు గుడుంబా స్వాధీనం చేసుకుని, విచారణ నిమిత్తం మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడికి అవార్డు
కాసిపేట: మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ నేషనల్ ఎడ్యుకేషనల్ బ్రిలియన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. దేశంలో విద్యాభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయులకు అవార్డు అందజేస్తారు. ప్రిన్సిపాల్ ఖలీల్, ఉపాధ్యాయులు అభినందించారు.